నేరేడు పండు.. పోషకాలు మెండు

- సీజన్‌లో మాత్రమే లభ్యం
- ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- మార్కెట్లో కిలో రూ.150 నుంచి రూ.200



మార్కెట్లో విక్రయానికి ఉంచిన నేరేడు పండ్లు

గోస్పాడు: నోరూరించే నేరేడు పండ్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ పండ్లు ఈ సీజన్‌లో జూన్, జూలై నెలల్లో మాత్రమే లభిస్తాయి. ఆరోగ్య ప్రదానియగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండటమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి మేలు చేస్తాయి. ఈ పండ్లను ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, మదనపల్లి, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు. పట్టణంలో వ్యాపారులు తోపుడు బండ్ల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం వ్యాపారులు వచ్చి పండ్లను విక్రయిస్తున్నారు. అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపం లోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్క్రీమ్ తయారు చేసుకోవచ్చు.

నాణ్యతను బట్టి రేటు

నేరేడుపండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడంతో ధర కూడా అధికంగానే ఉంటుంది. వినియోగ దారుల చేతికొచ్చే సరికి కిలో రూ.150 నుండి దర రూ.200 పలుకుతుంది. అందులో నాణ్యమైన నేరేడుపండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే అనేక రోగకారక సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

నేరేడు పండ్లతో ప్రయోజనాలు..

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడుపండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు మేలు చేస్తుంది.

అతిగా తింటే దుష్ఫలితాలు..

- నేరేడుపండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు.
- వగరు రుచి కలిగిన నాణ్యత లేని నేరేడుపండ్లు భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు. సీజన్ మారే సమయంతో ఈ పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను ఎక్కువగా తిన రాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడుపండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

నేరేడు పండ్లలో మంచి పోషకాలు



నేరెడు పండ్లలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. నీరు, ప్రొటీన్లు, కొవ్వులు, కార్బో హైడ్రేట్‌లు, విటమిన్‌లు, మినరల్స్ ఉంటాయి. వీటిని తగు మోతాదులో తీసుకోవాలి. షుగర్ వ్యాధి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతాయి. వేసవి కాలంలో వచ్చే సమస్యలకు మంచి పరిష్కారం ఉంటుంది. ప్రజలు సీజనల్‌గా వచ్చే పండ్లను మితంగా తీసుకోవాలి.

–గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

ఎన్నికల ఫలితాలపై అనుమానాలెన్నో?

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రజలను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. మహిళలకు, పేద, బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్‌లుగా పదవులు కట్టబెట్టారు. సంక్షేమ పథకాలు అందినా నిరుపేదలు, అక్కాచెల్లెమ్మలు, అవ్వాతాతలు అందరూ ఫ్యాను గుర్తుకే ఓటువేశామని చెబుతున్నారు. అయినా వైఎస్సార్‌సీపీకి ఇంత తక్కువ సీట్లు ఎందుకొచ్చాయి?, ఏమైనా జరిగివుంటుందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీకి కంచుకోటలైన గ్రామాలు, పట్టణాల్లో సైతం మెజార్టీ రకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఘోరంగా ఫలితాలు అందరినీ అయోమయానికి గురి చేశాయి. – సాక్షి నెట్‌వర్క్


ఎన్నికల్లో ఫలితాలతో ఆశ్చర్యం కలిగింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధితో పాటు పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటు అందించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీపై ప్రజలు ఎంతో అభిమానం చూపేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సైతం ఆ పార్టీకి ఓటు వేసి అభిమానం చాటుకున్నాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓటమి కావడంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎన్నికల్లో వచ్చిన ఫలితాల్లో గ్రామాలకు గ్రామాలు, పట్టణాలలో ఓట్లు పక్క పార్టీ వారికి పడినట్లు మెజార్టీ చూపిస్తుండడంతో ఎంతో బాధ వేసింది. ఎన్నికల ఫలితాలలో ఏం జరిగిందో అర్థం కాని పరిస్థితి ఉంది.

ఆర్థర్ సైమాన్, ఒంటివెలగల

మెజార్టీగా వైఎస్సార్‌సీపీకే ఓట్లు పడ్డాయి కానీ..



గ్రామంలో మెజార్టీగా వైఎస్సార్‌సీపీకే ఓట్లు పడ్డాయి. మేము ప్రజలను ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థించినప్పుడు ఎంతో ఉత్సాహం చూపారు. అనుకున్నట్లే గ్రామంలో ఫ్యాన్‌కు 152 ఓట్లు మెజార్టీ వచ్చింది. కానీ ఎక్కడ పొరపాటు జరిగిందో ఏమో తెలుదు కానీ మా అంచనా ప్రకారం 400 రావాల్సి ఉంది. దీనిపై మాకు అనుమానం ఉంది.

–రామక్రిష్టారెడ్డి, అల్లూరు

ఊహించలేదు



ఫలితాలు ఊహించని విధంగా టీడీపీకి వచ్చాయి. ప్రజలు వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తారని మాకు ధీమాగా ఉంది. మా పరిధిలో ప్రజలు వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామని చెప్పారు. కానీ ఎం జరిగిందో కానీ వైఎస్సార్‌సీపీ పట్టున్న గ్రామాల్లో టీడీపీ మెజార్టీ రావడం ఆశ్చర్యానికి గురిచేసింది.

–నాయక్ వసీం,ఎంపీపీ, శిరివెళ్ల

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం కృత్రికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సత్యమ్మ అమ్మవారు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో బుధవారం గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యమ్మ, మారెమ్మ, గంగమ్మ ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టి 41 రోజులు పూర్తయిన సందర్భంగా మూడు ఆలయాల్లో వేదపండితులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, ప్రజలు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కోవెలకుంట్ల: మూడేళ్లు నిండి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంఎల్‌హెచ్‌ఓ మమత, అంగన్‌వాడీ కార్యకర్త పుల్లమ్మ కోరారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కలుగొట్ల గ్రామంలో చిన్నారులు, తల్లులతో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు మధ్యాహ్నభోజనం ఉంటుందన్నారు. ప్రతి రోజు గుడ్డు, పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుజాత, ఆశావర్కర్లు విజయకుమారి, నాగేశ్వరి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దస్తగిరి

బనగానపల్లె రూరల్ : నూతనంగా ఏర్పడే కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి మెగా డీఎస్సీని ప్రకటిస్తూ మొదటి సంతకం చేయాలని యూటీఎఫ్ జిల్లా కో ఆడిట్ కన్వీనర్ దస్తగిరి, జిల్లా సహా అధ్యక్షుడు సత్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నూతనంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. జీవో నంబరు 117ను రద్దు చేస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని, విద్య హక్కు చట్టప్రకారం ప్రతి పాఠశాలలోను ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు సుధాకర్, కృష్ణయ్య, సతీష్, నాగరాజు, మనోహర్, సన్నన్న, గోపాల్, పూజారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సకాలంలో ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): అధికారులు రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాలు అరికట్టడంలో విఫలమయ్యారన్నారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, మోటరాముడు, సోమన్న, శ్రీనివాసులు, సంజీవ్ ప్రభాకర్, ప్రతాప్, సురేష్‌లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



బ్రాహ్మణసమాఖ్య ఆధ్వర్యంలో మొక్కను నాటుతున్న దృశ్యం



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

నంద్యాల వ్యవసాయం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నంద్యాల అడ్వకేట్స్ బార్ అసోసియేషన్, విద్యాశాఖ గ్రీన్ కోర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాల కోర్టు ఆవరణలో ఘనంగా జరిగిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణ సామాజిక బాధ్యతగా భావించాలని, ఎక్కడికక్కడ మొక్కలు నాటడంవల్ల భూతాపం తగ్గి పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, నంద్యాల అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావినూతల దుర్గ ప్రసాద్, జనరల్ సెక్రెటరీ భూపని వెంకటేశ్వర్లు, నంద్యాల ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ నాగమణి, నేషనల్ గ్రీన్ కార్ప్ కోఆర్డినేటర్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో రామకృష్ణ విద్యాలయం సహకారంతో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరజోణ సుదీర్, రామకృష్ణ విద్యాలయ అధికారి ముని శేఖర్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నంద్యాల అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గా ప్రసాద్, మల్లిక, ప్రశాంతి, నందాలాల్, పరమేష్ పాల్గొన్నారు.

బయలు వీరభద్రస్వామికి విశేషార్చన



వీరభద్రస్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడైన బయలు వీరభద్రస్వామికి బుధవారం అమావాస్య ఘడియలు రావడంతో విశేషార్చన జరిపించారు. అ ఛ్రివాస్య రోజున భక్తులు పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 16 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా విశేషపూజను జరిపించుకున్నారు. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపారు. అనంతరం పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు.

8 నుంచి బస్ పాస్‌ల జారీ

బనగానపల్లె : పాఠశాలలు 12వ తేదీన పునఃప్రారంభమవుతుండడంతో 8వ తేదీ నుంచి కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తామని బనగానపల్లె ఆర్టీసీ డీఎం రవికిశోర్ తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్ మార్పు కారణంగా 6,7వ తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పని చేయవన్నారు. 8వ తేదీ నుంచి కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని తెలిపారు.

ఘర్షణ కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామంలో ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. ఆదిశేషుతో పాటు మరో ఇద్దరు, భాస్కర్‌తో మరోఎనిమిది మంది పాతకక్ష్యలను మనసులో పెట్టుకొని ఒకరిపై ఒకరు ఘర్షణ పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ల్యాబ్‌టెక్నీషియన్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న రామేశ్వరరావ్

డోన్ : వ్యాధి నిర్ధారణలో ల్యాబ్‌టెక్నీషియన్ల పాత్ర కీలకమని మలేరియా జిల్లా ముఖ్య అధికారి రామేశ్వరరావ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్ టెక్నిషియన్ల రెండురోజుల శిక్షణ ముగింపు సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మైక్రోస్కోప్ ద్వారా మలేరియా పరాన్నజీవి ఏవిధంగా ఉందో పరీక్షించడంలో ల్యాబ్ టెక్నిషియన్ల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడమే ఈ రెండురోజుల శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 12 మంది ల్యాబ్ టెక్నిషియన్లకు నాలుగు విడతలుగా శిక్షణ ఇచ్చినట్లు విస్తరణ అధికారి రామవిజయారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్లు సుబ్బలక్ష్మయ్య, డాక్టర్ సాబాస్‌హసన్, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హార్టికల్చర్‌పై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ రేష్మ

కొత్తపల్లి: మండలంలో హార్టికల్చర్ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు హార్టికల్చర్ వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను వివరించి ఉద్యానవన పంటల వైపు వారిని ఆకర్షించాలన్నారు. మండలానికి ఐటీడీఏ, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ల ద్వారా 300 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు అనుమతులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 105 ఎకరాలకు ఎస్టీమేషన్ పూర్తి అయ్యిందన్నారు. ఇంకా ఎవరైనా రైతులు ఉద్యానవన పంటల సాగుకు ముందుకురావాలంటే స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల కోడ్ పూర్తిఅయిన తర్వాతా హార్టికల్చర్ సాగుకు అనుమతులు వాస్తాయన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



చెంచుగూడెంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా మలేరియా సహాయాధికారి వరప్రసాద్‌రెడ్డి



ఇంటిలో డీడీటీ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న సిబ్బంది

చాగలమర్రి: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ నంద్యాల జిల్లా సహాయ అధికారి వరప్రసాద్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని డి.వనిపెంట, చెంచుగూడెం గ్రామాలలో మలేరియా నివారణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా చెంచుగూడెం కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటి ఆవరణలో మొదటి విడత డీడీటీ పిచికారీ సిబ్బంది చేశారు. అనంతరం మలేరియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్యాలపాడు పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యులు శివమోహ, ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ జి.బాలస్వామి, సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణాలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టాఫ్, వర్కర్స్, ఏఐటీయూసీ (హెచ్-64) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రావుల మురళి డిమాండ్ చేశారు. బుధవారం జలవిద్యుత్ కేంద్రం వద్ద ఆయన కార్మిక జెండాను ఎగురవేశారు. మురళి మాట్లాడుతూ కార్మికులకు ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ వర్తించేలా చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌గా మార్చాలని, ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యేసయ్య, మస్తాన్, మల్లికార్జున పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న అటవీ అధికారులు

ఆళ్లగడ్డ : మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని రుద్రవరం రేంజ్ అటవీ అధికారి శ్రీపతినాయుడు నాయుడు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాల ఆధ్వర్యంలో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి పర్యావరణం పరిరక్షణపై అవగాహన కార్యాక్రమాలు నిర్వహించారు. రుద్రవరం రేంజ్ అటవీ అధికారి శ్రీపతినాయుడు ఆధ్వర్యంలో అహోబిలం రిజర్వు ఫారెస్ట్ సమీపంలో ఉన్న నవనారసింహ క్షేత్రాల ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు, పాల్‌తిన్ కవర్లు ఏరి వేశారు. అనంతరం శీతల్ బేష్ క్యాంపు సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అహోబిలం డీఆర్వో ముక్తార్ బాషా, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బస్ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: పట్టణం సమీపాన 44వ జాతీయ రహదారిపై బుధవారం ఆర్‌టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరుకు చెందిన ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి వెళ్తుండగా తనిఖీ చేశారు. రోడ్ ట్యాక్స్ చెల్లించలేదని గుర్తించిన ఆర్‌టీఓ రూ.58,500 జరిమానా విధించారు.

ఏఎంసీ విభాగం విస్తరణకు చర్యలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీ విభాగాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన ఏఎంసీ విభాగం పక్కన ఉన్న పూర్వ బ్లడ్‌బ్యాంక్‌ను సందర్శించారు. ఈ బ్లడ్ బ్యాంక్ స్థానంలో అదనంగా ఏఎంసీ విభాగానికి పడకలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఏఎంసీ విస్తరణ వల్ల పడకల సంఖ్య పెరిగి అత్యవసర వైద్యం అందుకునే రోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే క్యాజువాలిటీపై భారం తగ్గుతుందని చెప్పారు. ఏఎంసీలో పడకలు లేక చాలా మంది రోగులు ఎక్కువ సమయం క్యాజువాలిటీలోనే ఉండాల్సి వస్తోందని, ఇకపై ఆ ఇబ్బందులు తప్పనున్నాయని ఆయన తెలిపారు.

హిందూ సంప్రదాయాలను అలవర్చుకోవాలి



భగవద్గీత సారాంశాన్ని బోధిస్తున్న మల్లు వెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ హిందూధర్మ సంప్రదాయాలను అలవర్చుకోవాలని తిరు మల తిరుపతి దేవస్థానం ఉమ్మడి కర్నూలు జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో హిందూ ధార్మిక అలవాట్లు, సంప్రదాయాలు ఆచరణీయమైనవాటిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు హిందూ ధార్మిక చింతన అలవడేలా చేయాలన్నారు. తద్వారా నైతికత, సంఘనీతి, స్నేహశీలత్వం వంటి సులక్షణాలు అలవడుతాయన్నారు. అనంతరం నాగేశ్వరరెడ్డి భగవద్గీత సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరమనారెడ్డి, రవికుమార్, నాగశేషయ్య, ఓంకారమాచారి, ఎన్.వెంకటరమణారెడ్డి, ఎన్.నాగిరెడ్డి, జి.పుల్లయ్యగౌడు, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత



భగవద్గీత గ్రంథాలతో కార్యకర్తలు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. స్థానిక ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన బజరంగ్‌దల్ శౌర్య ప్రశిక్షణ వర్గ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందువుల ఐక్యతకు, ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అనంతరం వీహెచ్‌పీ నగర ఉపాధ్యక్షుడు శివపురం నాగరాజు తల్లి నాగరత్నమ్మ చేతుల మీదుగా సుమారు 200 మంది వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కోకన్వీనర్ సందీప్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, నాయకులు శశికుమార్, పెంచల్‌రెడ్డి, రవికుమార్, పిచ్చయ్య చౌదరి, కమ్మయ్య, నీలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.